

లంబోదరా నమో..నమః

నేడు వినాయక చవితి



కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 6: ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా 'వినాయక చవితి' తెచ్చే సంబరం.. సంతోషం ఎంతో ప్రత్యేకం. పల్లె నుంచి పట్టణం దాకా ఎవరి స్థాయిలో వారు అంబరాన్నంటేలా సంబరాల పండుగ వినాయక చవితి. ఉమ్మడి కర్నూలు జిల్లా అంతటా వాడవాడలా ఇప్పటికే గణేశ్ మండపాలు ఏర్పాటయ్యాయి. విభిన్న రూపాల్లో రూపుదిద్దుకున్న గణపతి ప్రతిమలను యువకులు కొనుగోలు చేసి మండపాల వద్దకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లారు. శనివారం చవితినాడు గణనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మరోవైపు పండుగకు అవసరమైన పూలు, పండ్లు తదితర సామగ్రి దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

జిల్లాలో నవరాత్రి వేడుకల సందడి

తొమ్మిదిరోజుల పాటు విశేషంగా అలరించే నవరాత్రి ఉత్సవాల సందడి శుక్రవారం సాయంత్రం నుంచే కానవచ్చింది. వివిధ ప్రాంతాలకు చెందిన గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు తమ తమ మంటపాలకు ఉత్సవ మూర్తులను తరలిస్తూ కానవచ్చారు. కొన్ని ప్రాంతాల్లో డీజే సౌండ్ సిస్టమ్స్, డప్పు నృత్యాలతో, బాణసంచా కాలుస్తూ సందడిగా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, మంటపాల్లో ప్రతిష్ఠించారు. మంటపాల చుట్టూ రంగు రంగుల విద్యుద్దీపాలు, ప్రత్యేక అలంకరణలు చేయడంలో నిమగ్నమయ్యారు. లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేసి, భక్తిపాటలతో సిద్ధమయ్యారు. వేడుకల సందర్భంగా గణేశ్ నవరాత్రి మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వారు కోరారు.










వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత



మార్కెట్‌లో వివిధ రకాల విగ్రహాలు



63 అడుగుల ఎకో ఫ్రెండ్లీ గణపతి

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటి చెబుతూ కర్నూలుకు చెందిన యువత ఏకంగా 63 అడుగుల ఎత్తులో ఎకో ఫ్రెండ్లీ గణపతి మూర్తిని రూపొందించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఈ భారీ మట్టి వినాయకుడు భక్తులతో 11 రోజుల పాటు పూజలు అందుకోనున్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున ఈ ఉత్సవ గణపతిని నెలకొల్పారు. బంకమట్టి, వెదురు బద్దలు, జనపనార, కొబ్బరిపీచు, గడ్డి, నీటిలో సులువుగా కరిగిపోయే సంప్రదాయ రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఇతర గణపతి మూర్తుల్లా కాకుండా, గణేశ్ నవరాత్రి ఉత్సవాల అనంతరం ఈ మట్టి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించకుండా ఉన్న చోటే నిమజ్జనం చేస్తున్నారు. ఫైర్ ఇంజన్ల ద్వారా నీటిని విగ్రహంపై పిచికారీ చేస్తూ కరిగిన మట్టి తుంగభద్ర నదిలో కలిసిపోయేలా ఏర్పాట్లు చేశారు. నగరంలోని లక్ష్మీనరసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఈ భారీ గణపతి మూర్తిని తయారు చేసేందుకు ప్రత్యేకంగా కోల్‌కతాకు చెందిన 15 మంది కళాకారులు నెల రోజులుగా శ్రమించి ఈ విగ్రహాన్ని తయారు చేశారు. పీఓపీ, రసాయనాలతో కూడిన విగ్రహాల వల్ల జలకాలుష్యం అయి, నీటిలోని జీవరాశి నశించిపోతుందని, పర్యావరణ హిత గణపతులను పూజించాలనే నినాదంతో ఈ విగ్రహాన్ని నెలకొల్పినట్లు నిర్వాహకుడు కల్యాణ్‌కుమార్ తెలిపారు.

9న తుంగభద్ర డ్యామ్‌కు నిపుణుల కమిటీ

- కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్‌తోపాటు 32 గేట్లు తనిఖీ
- రికార్డులు సిద్ధం చేస్తున్న బోర్డు అధికారులు



తుంగభద్ర డ్యాం



కమిటీలో ఆదోనికి చెందిన సుధాకర్

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టును ఈ నెల 9, 10 తేదీల్లో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ సందర్శించనుంది. గత నెల 10న చైన్ లింక్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్ట్‌గేట్‌తో పాటు మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల భద్రత, పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. దీనికోసం జాతీయ జలాశయాలు భద్రతా సంస్థ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో బృందం పర్యటించనుంది. ఢిల్లీకి చెందిన రిటైర్డ్ మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుడు హర్కేశ్ కుమార్, జాతీయ, అంతర్జాతీయ సాగునీటి ప్రాజెక్టుల కోసం పని చేసిన కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుడు తారాపురం సుధాకర్ సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఎంపిక చేసే ఇంజనీరింగ్ ప్రతినిధులతో కూడిన ఆరుగురు సభ్యుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఎన్‌డీఎస్‌ఏ నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్, హర్కేశ్‌కుమార్, తారాపురం సుధాకర్ ఈ ముగ్గురు హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్‌గా వివిధ అధ్యయన కమిటీల్లో ఇప్పటికే పని చేసిన అనుభవం ఉంది. ఆగస్టు 10న తుంగభద్రకు వరద తగ్గడంతో రాత్రి ఎత్తిన క్రస్ట్ గేట్లు దింపుతున్నారు. ఆ సమయంలో చైన్ లింక్ తెగిపోవడంతో 19వ నంబరు గేటు కొట్టుకుపోయిందని టీబీపీ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. చైన్‌లింక్ తెగిపోయినా క్రస్ట్‌గేట్ గ్రూవ్ (గాడి) నుంచి విడిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబు, సిద్ధరామయ్య ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు చేయించారు. స్టాప్‌లాగ్ ఏర్పాటులో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు కీలక పాత్ర పోషించి రైతు బాంధవుడుగా నిలిచిపోయారు. అయితే.. గేటు ఎలా కొట్టుకుపోయింది..? మిగిలిన గేట్లు ఎంతవరకు భద్రం..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం ముందు, తరువాత క్రస్ట్‌గేట్లు తనిఖీ, చేపట్టిన మరమ్మతులు వివరాలు సహా డ్యాం డిజైన్, హైడ్రో - మెకానికల్, ఎలక్ట్రికల్ డిటైల్స్ కావాలని నిపుణుల కమిటీ బోర్డు అధికారులను కోరినట్లు సమాచారం. కమిటీ అడిగే వివరాలు తక్షణమే అందించేందుకు అవసరమైన సమగ్ర వివరాలతో టీబీపీ బోర్డు అధికారులు నివేదికలు తయారు చేస్తున్నట్లు సమాచారం. ఎన్‌డీఎస్‌ఏ నియమించిన నిపుణుల కమిటీలో హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్‌లలో ఒకరైన తారాపురం సుధాకర్ జిల్లాకు చెందిన ఆదోని పట్టణవాసి కావడం కొసమెరుపు.

ఏకే బజాజ్‌కు 35 ఏళ్లకు పైగా అనుభవం

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల భద్రతపై అధ్యయనం కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎంపిక చేసిన నిపుణుల కమిటీ చైర్మన్ ఏకే బజాజ్ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా 2008 ఏప్రిల్ 14 నుంచి 2011 ఆగస్టు 31 వరకు మూడున్నరేళ్లుగా పని చేశారు. ఢిల్లీకి చెందిన ఏకే బజాజ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా అందుకున్నారు. ఆ తరువాత ఫ్లడ్, వాటర్ రిసోర్సెస్ అంశాలపై ఎంటెక్ చేశారు. కేంద్ర జల సంఘంలో వివిధ హోదాల్లో పని చేశారు. సీడబ్ల్యూసీ చైర్మన్‌గా, భారత ప్రభుత్వ జల వనరుల మంత్రిత్వ శాఖ ఎక్స్-అఫీషియో కార్యదర్శిగా పని చేశారు. పర్మనెంట్ కమిటీ ఫర్ టెక్నికల్ యాక్టివిటీస్ (పీసీటీఏ), పర్మనెంట్ ఫైనాన్స్ కమిటీ (పీఎఫ్‌సీ), ఐసీఐడీ స్టాఫ్ కమిటీ (ఎస్‌సీ) సభ్యుడిగా కూడా ఉన్నారు. దేశంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులు డిజైన్, ప్రణాళిక తయారీ, మేజర్, మీడియం, బహుళార్థసాధక ప్రాజెక్టుల ఏటా వరద నిర్వహణ (ఫ్లడ్ మేనేజ్‌మెంట్)పై 35 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

10న పారా మెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 6: కర్నూలు మెడికల్ కళాశాలలో రెండో విడత పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్‌ను ఈ నెల 10వ తేదీన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్లు డీఎంఎల్‌టీ-14, డీఏఎన్‌ఎస్-5, డీఎంఐటీ-4, డీఆర్‌జీఏ-3, డీవోఏ-2, డయాలసిస్-6, డార్క్‌రూం అసిస్టెంట్-6, ఈసీజీ-3, క్యాత్‌ల్యాబ్-3, డిప్లొమా కార్డియాలజిటెక్-3 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు.

మార్కెటింగ్ శాఖ డీఈఈగా రఘునాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 6: కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ డీఈఈగా అనంతపురం జిల్లాలో పని చేస్తున్న రఘునాథరెడ్డిని నియమిస్తూ కమిషనర్ విజయసునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న సుబ్బారెడ్డిని ఆదోని డివిజన్ మార్కెటింగ్ శాఖ డీఈఈగా బదిలీ చేశారు. కర్నూలు డీఈఈగా బదిలీపై వచ్చిన రఘునాథరెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లా పరిధిలోని 8 మార్కెట్ కమిటీల్లో రైతులకు అవసరమైన ప్లాట్‌ఫారాలు, గోదాములు తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రైతన్నకు ఎంత కష్టం..





కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 6: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతన్నను నట్టేట ముంచేశాయి. కొన్ని చోట్ల పొలం మీదనే పంటలు వర్షార్పణం కాగా మరికొన్ని గ్రామాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన పసుల రంగడు పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్‌లో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశాడు. విత్తులు, దంతెలు, కలుపు తొలగింపు, ఎరువులు, పిచికారీ వంటి ఖర్చుల కింద ఎకరాకు రూ.40 వేలకు పైగా ఖర్చు పెట్టాడు. కౌలు తీసుకున్నందుకు భూ యజమానికి ఎకరాకు రూ.12 వేలు చెల్లించాలి. అయితే పది రోజుల క్రితం వేరుశనగ కట్టెను తొలగించి పొలంలో ఆరబెట్టాడు. రెండు మూడు రోజులు ఎండలు వస్తే యంత్రంతో కోత చేయాలని రైతు ఆలోచన. కానీ పంట తొలగించిన రోజు మొదలు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో గ్రాసం తడిచిపోయి కుళ్లిపోయింది. వేరుశనగకాయలు వర్షాలకు పూర్తిగా తడవడంతో మొలకలు వచ్చాయి. బురద తగ్గితే తప్ప యంత్రం లేదా కూలీలు పొలంలో దిగే పరిస్థితి లేదు. దీంతో గ్రాసం బూజుతో నల్లబారిపోయిందని, వేరుశనగ కాయలు మొలకలు రావడంతో పెట్టుబడి, కౌలు ఖర్చులు రావడం గగనమని రైతు కన్నీటి పర్యంతం చెందాడు.

కుళ్లిపోయిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు రంగడు

జలాశయానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



అరుగేట్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న వరద

శ్రీశైలం, సెప్టెంబరు 6: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు జలాశయం ఆరు క్రస్టుగేట్లను తెరిచి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,43,802 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 1,64,432 వరద వస్తోంది. జలాశయం ఆరు క్రస్టు గేట్లు ఎత్తి 1,67,076 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,49,435 క్యూసెక్కుల వరద వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.40 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది.

మిరప ధర పతనం

- ప్యాలకుర్తిలో వంద ఎకరాల్లో సాగు
- గిట్టుబాటు కల్పించాలని రైతుల ఆవేదన

కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 6: కొన్నాళ్ల కిందట మంచి డిమాండ్ ఉన్న పచ్చిమిరపకు రేటు తగ్గింది. రైతులు దగాపడి దళారులు, వ్యాపారులు మాత్రం బాగుపడుతున్నారు మిరప తోటల ఎదుగుదలకు, కాయ నాణ్యత దెబ్బతినకుండా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. ధరలు మాత్రం పడిపోతున్నాయి. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో దాదాపు 100 ఎకరాల్లో పచ్చిమిరప సాగు చేశారు. మిరపసాగులో విత్తులు, నారుపెంపకం, ఎరువులు, పురుగుమందుల ఖర్చులతో కలిపి ఎకరాకు రూ లక్ష పైగా ఖర్చు అవుతోంది. రెండు నెలల తర్వాత మిరప కోతలు ప్రారంభం అవుతాయి. ఎకరాలో పంట కోతకు సుమారు 50 మంది దాకా కూలీలు అవసరం. ఒక్కో కూలీకి చార్జీ కలిపి రూ 350 ఖర్చు అవుతుంది. అయితే ప్రస్తుతం మార్కెట్లో పచ్చిమిరప ధరలు ఆశాజనకంగా లేవని రైతులు వాపోతున్నారు. పదికిలోలకు రూ. 30 నుంచి రూ. 50 మాత్రమే లభిస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇందులో దళారీ కమీషన్, వాహన బాడుగ, కూలీల ఖర్చు తీస్తే మిగిలేదేమీ ఉండదని, దారుణంగా నష్టపోతున్నామని ప్యాలకుర్తికి చెందిన షఫీ, క్రిష్ణ, ఆంజనేయులు, మోదీన్, శ్రీనివాసరెడ్డి తెలిపారు



విరగ్గాసిన మిరప



పది ఎకరాల్లో సాగు చేశా: షఫీ, ప్యాలకుర్తి



ఈ ఖరీఫ్‌లో పది ఎకరాల్లో పచ్చి మిరప సాగు చేశా. ఇప్పటికి సుమారు రూ.8 లక్షలు ఖర్చయింది. కోతలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల నుంచి రోజుకు 60 మంది చొప్పున కూలీలతో కోత చేయిస్తున్నాను. ఒక్కో కూలీకి చార్జీలు కలిపి రూ.350, పచ్చి మిరప ఒక్కో సంచి మార్కెట్ రవాణాకు రూ. 50 చెల్లిస్తున్నాం. పచ్చి మిరప మార్కెట్లో తక్కువ ధరకు కొంటున్నారు. ఒకవేళ కోతలు ఆపితే కాయ దెబ్బతింటుంది. మొన్నటి కోతలో రూ.4 వేలు నష్టం వచ్చింది. అయినప్పటికీ నష్టాలు భరిస్తూ కోయిస్తున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వాలి.

రైతుకు నష్టాలే : దోని క్రిష్ణ



రెండు ఎకరాల్లో పచ్చిమిరప సాగు చేశాను. కోతకు సిద్ధంగా ఉంది. తీరా మార్కెట్లో ధరలతో పోల్చితే కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోదు. బహిరంగ మార్కెట్లో మాత్రం పచ్చి మిరప కిలో రూ.30 అమ్ముతున్నారు. దళారికి కమీషన్ వస్తుంది. వ్యాపారులు లాభం లేకుండా విక్రయించరు. రైతుల కష్టాలు వారెవరికీ పట్టవు.



విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది పీఈటీలే

● మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 6: విద్యాసంస్థల్లో విద్యార్థులను క్రీడాకారులుగా మలిచేది వ్యాయామ ఉపాధ్యాయులేనని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉత్తమ పీఈటీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో క్రీడా మౌలిక సదుపాయాలతోపాటు పరికరాలు అందిస్తే విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పీఈటీలు మలచగలుగుతారని ఆయన పేర్కొన్నారు. అలాంటి క్రీడాకారులను తయారు చేసే పీఈటీలకు ఉత్తమ పీఈటీల అవార్డులు ఇవ్వడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ పీఈటీ గ్రహీతలైన ఎంఎండీ బాషా, సుబ్రహ్మణ్యం, కొండెపోగు చిన్న సుంకన్న, ఓబన్న, రాఘవేంద్ర, సాలమ్మ, సరళ, కళ్యాణి, కవితలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేసన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, విశిష్ట అతిథి స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, సి.హర్షవర్ధన్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, గుడిపల్లి సురేందర్, నాగరత్నమయ్య, వంశీ, ప్రభాకర్, మాజీ ఎస్ఎఫ్ఐ సెక్రటరీ లక్ష్మయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

లోకాయుక్త తరలింపును వ్యతిరేకించాలి

● హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుకు బార్ అసోసియేషన్ నిర్ణయం


అత్యవసర సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాది

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 6: కర్నూలులో ఉన్న రాష్ట్ర లోకాయుక్త, ఉప లోకాయుక్త, మానవ హక్కుల సంస్థ, రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్‌లను అమరావతికి తరలించే నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కర్నూలు బార్ అసోసియేషన్ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సంస్థలను కర్నూలు నుంచి అమరావతికి తరలించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలంటూ కొందరు వ్యక్తులు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై చర్చించేందుకు శుక్రవారం కర్నూలు బార్ అసోసియేషన్ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాష్ట్ర హైకోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికే కర్నూలులో ఉన్న సంస్థలను ఎటువంటి పరిస్థితుల్లో తరలించరాదని డిమాండ్ చేశారు. హైకోర్టులో ఉన్న ఈ రిట్ పిటిషన్‌లో ప్రతి బార్ అసోసియేషన్ ఇంప్లీడ్ పిటిషన్లను దాఖలు చేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎ.రామసుబ్బారెడ్డి, సి.నాగేంద్రనాథ్, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, కె.కపిలేశ్వరయ్య, పి.నరసింహులు, మురళీ మనోహర్, ఎస్.చాంద్‌బాషా పాల్గొన్నారు.

వెల్దుర్తిలో దొంగతనం

మరో మూడు దుకాణాల్లో చోరీకి విఫల యత్నం

వెల్దుర్తి, సెప్టెంబరు, 6: వెల్దుర్తిలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సాయిరాం సీడ్స్ దుకాణం షెట్టరు తాళాలు పగులగొట్టి రూ.5 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అలాగే పట్టణంలో శ్రీలక్ష్మీనరసింహ ట్రేడర్స్ ఫర్టిలైజర్, పక్కనే ఉన్న ప్రకాష్ పశువుల దాణా, డోన్ రైల్వేగేటు సమీపంలోని దుకాణాల తాళాలను పగులగొట్టారు. ఈ మూడు దుకాణాలలో నగదు, వస్తువులు చోరీ జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పత్తికొండ, సెప్టెంబర్ 6 : పత్తికొండ సమీపంలో జగనన్న కాలనీ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పత్తికొండ మండలపరిధిలోని జెఎం తాండకు చెందిన అంజినాయక్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వాహనాలపై వెళ్తున్న కొందరు ఆయనను చికిత్సకోసం ఆటోలో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీలపై ఉత్కంఠ

పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్న ఉద్యోగులు


ఆదోని తహసీల్దార్ కార్యాలయం

ఆదోని, సెప్టెంబరు 6: రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలపై ఉత్కంఠ నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖలో బదిలీలు చాలా వరకు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలమైన రెవెన్యూ అధికారులను నియమించుకొని అడ్డగోలుగా భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం అలాంటి వాటికి తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారిని సైతం పట్టణ ప్రాంతాల్లో నియమించుకునేలా చూడాలని ఉద్యోగ వర్గాలు సైతం కోరుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం చాలా మంది రెవెన్యూ అధికారులు బదిలీల నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. తాజాగా వీరికి స్థాన చలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలా మందికి అన్యాయం జరుగుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉద్యోగ సంఘాల్లో వారి బాధ్యత ఏమిటీ.. ఆ పదవి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడానికేనా.. లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడుతుందా..? అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టత ఇవ్వాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

● బదిలీల నుంచి తప్పించుకోవడానికే..

గతంలో రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగినప్పుడు రూ.లక్షల్లో చేతులు మారాయి. కొంత మంది తెలివిగా కొంత మొత్తాన్ని ఉద్యోగ సంఘానికి ఫండ్‌గా ఇస్తే ఏదో ఒక పదవి దక్కుతుందని భావించి ఆయా సంఘాలు, అసోసియేషన్లు, ప్రభుత్వ అధికారుల సంఘాల్లో చేరిపోయారు. తాలూకా, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు ఇలా పలు బాధ్యతల్లో ఉన్నారు. ఈ పదవులు చూసి వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వరాదని కొందరు రెవెన్యూ శాఖ అధికారులు కోరుతున్నారు.

● ప్రజా ప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలవుతోంది. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో పట్టు బిగించుకునేందుకు కావలసిన అధికారులను నియమించుకునేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు రెవెన్యూ శాఖలోని అధికారులు ఆ సీటు కోసం పైరవీలు ప్రారంభించారు. అందుకు కావలసిన వారిని వెంట తీసుకెళ్లి ముడుపులు ముట్టజెప్పేందుకు కూడా వెనకాడడం లేదు.

● ఫెవికాల్ అధికారులపై ప్రత్యేక నిఘా

రెవెన్యూ శాఖలో ఎన్నో ఏళ్లుగా ఒకే కార్యాలయం లోనే ఉంటూ బదిలీల్లో పక్క మండలానికి వెళ్లడం.. ఆరు నెలలపాటు పని చేసి మళ్లీ అదే మండలానికి వచ్చి విధులు నిర్వహిస్తున్న ఫెవికాల్ అధికారులపై ప్రత్యేక నిఘా ఉంచారు. కూటమి నాయకులు అలాంటి వారిని గుర్తించే పనిలో పడ్డారు. అలాంటి వారందర్నీ సొంత జిల్లా నుంచి మరో జిల్లాకు తరలించాలన్న ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకోవాలి

● ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 6: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా సంతోషంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు, అపశృతులకు తావు లేకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా జరుపుకోవాలని సూచించారు.

నిబంధనలు ఇలా:

జిల్లాలో ఉన్న వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పోలీసు సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వినాయక విగ్రహాల మండపాలకు వాహనాలు దూరంగా నిలిపే విధంగ చూసుకోవాలి.
- విద్యుత్ సరఫరాకు, వాహనాల రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదు
- పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు ఇబ్బంది కలిగించేలా లౌడ్ స్పీకర్లు పెట్టరాదు
- రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు, మైకులు ఆపి వేసే విధంగా మండపాల నిర్వాహకులు చూసుకోవాలి.
- 24 గంటలు విగ్రహాల వద్ద కాపలా, పర్యవేక్షించుకునే బాధ్యత మండపం నిర్వాహకులదే.
- ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసు అధికారులకు లేదా డయల్ 100 పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

మతసామరస్యానికి కర్నూలు జిల్లా ప్రతీక

కులమత విభేదాలు లేకుండా ప్రజలందరూ సోదర భావంతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు నిర్వాహకులు, మేధావులు, మత పెద్దలు రాజకీయ పార్టీలు, యువత మీడియా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

'ఘన వ్యర్థాల తయారీ కేంద్రాలను పూర్తి చేయాలి'



రిసోర్స్ పర్సన్లతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: జిల్లాలో ఘనవ్యర్థాల తయారీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల ని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జడ్పీలో ఆయన చాంబర్‌లో రీసోర్స్ పర్సన్లతో సమీక్ష నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి 90 గ్రామాలను మోడల్ గ్రామాలకు తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ గ్రామా లుగా ఎన్నిక కావాలంటే ప్రధానంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించి ఉండాలన్నారు. అంతే కాకుండా ఘనవ్యర్థాల తయారీ కేంద్రాలు అందుబాటులోకి తీసుకు వస్తేనే మోడల్ గ్రామాలుగా గుర్తిస్తారని ఆయన తెలిపారు. ప్రధానం గా ఎక్కడైన స్థల సమస్యలు ఉంటే సంబంధిత ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు జేమ్స్ కృపవరం, మహేశ్వరి, అఫ్రస్‌బాషా, జగన్నాథం, సునీత, పద్మావతి పాల్గొన్నారు.

రూ.42.54 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు సంబంధించి 613 సీసీ రోడ్లకు రూ.42.54 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆదోని నియోజకవర్గంలో 78 రోడ్లకు రూ.5 కోట్లు, ఆలూరు నియోజకవర్గంలో 204 రోడ్లకు రూ.12.75 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 153 రోడ్లకు రూ.14.63 కోట్లు, పత్తికొండ నియోజకవర్గంలో 178 రోడ్లకు రూ.10.10 కోట్లు కలిపి మొత్తం రూ.4254 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నూతన రోడ్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు అందడంతో అధికారులు పంపించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యం, బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కౌతాళం, సెప్టెంబరు 6: మండల పరిధిలోని మేళిగనూరు, నదిచాగి గ్రామాల మధ్య బండిరస్తా వద్ద శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంటకుంట గ్రామానికి చెందిన కుమార్, రాఘవేంద్ర మల్లయ్యతో పాటు ఉరుకుంద గ్రామానికి చెందిన ఈడిగ మల్లయ్య, కాత్రికి గ్రామానికి చెందిన మహేంద్ర నాలుగు ద్విచక్ర వాహనాలపై కర్ణాటకలోని మురణి గ్రామం నుంచి 30 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి 30 బాక్సుల మద్యంతోపాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మద్యం రవాణ కేసులో ఒకరి అరెస్టు


సీజ్ చేసిన మద్యం

మంత్రాలయం, సెప్టెంబరు 6: మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి మోటారు సైకిల్‌పై మద్యం తెస్తుండగా.. ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, మాధవరం చెక్‌పోస్టు ఎస్ఐ వీరస్వామి దాడులు చేసి పట్టుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గరీబ్ మహ్మద్ ఆల్తాఫ్, కర్ణాటకలోని రాయచూరు చెందిన వినోద్, ఎమ్మిగనూరు చెందిన వినోద్, మమత అనే వ్యక్తులు మద్యం తెస్తుండగా పట్టుకున్నారు. రెండు చోట్ల వేర్వేరు సమయాల్లో ముగ్గురుని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న బైక్‌ను సీజ్ చేసి ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వద్దనున్న 672 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నందికొట్కూరులో మహిళ హత్య

● తొమ్మిదేళ్ల నాటి తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్న యువకుడు


శాలుబీ (ఫైల్)

నందికొట్కూరు, సెప్టెంబరు 6: నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ మహిళ గురువారం రాత్రి దారుణహత్యకు గురైంది. పది సంవత్సరాల క్రితం తన తండ్రి హత్యని హత్య చేసిన ఘటనలో లక్ష్మి నరసింహ అనే యువకుడు శాలుబీ(41) అనే మహిళను గొడ్డలితో నరికి చంపాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన శాలుబీ దొంగతనాలతోపాటు నేర ప్రవృత్తితో జీవనం సాగించేది. శాలుబీ మొదటి నుంచి నేర ప్రవృత్తి కలిగి ఉండడంతోపాటు, మర్డర్ కేసుల్లో ముద్దాయి, రౌడీషీటర్‌గా ఆమె ఉన్నారు. పట్టణానికి చెందిన వడ్డె గజేంద్ర అనే వ్యక్తి 2015లో హత్యకు గురయ్యాడు. అయన హత్య కేసులో శాలుబీ ఏ1 నిందితురాలిగా ఉంది. ఈ క్రమంలో గజేంద్ర కుమారుడు లక్ష్మి నరసింహను కొంతమంది స్నేహితులు రెచ్చగొట్టారు. 'మీ నాన్నను చంపిన వ్యక్తిని ఏమి చేయలేకపోతున్నావు..' అంటూ హేళన హేళనగా మాట్లాడేవారు. దీంతో తండ్రి హత్యకు కారణమైన శాలుబీని మిత్రులతో కలిసి హత్య చేయాలని భావించాడు. గురువారం రాత్రి శాలుబీ ఇంట్లో ఉండగా ఇంటి తలుపులను ధ్వంసం చేసి శాలుబీని గొడ్డలితో నరికి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. మృతురాలి కుమారుడు మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

పొదుపు మహిళల సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే



నిత్యావసర వస్తువుల వాహనాన్ని ప్రారంభిస్తున్న గౌరు చరిత

ఓర్వకల్లు, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో ఓర్వకల్లు పొదుపు మహిళల అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం బాలభారతి పాఠశాలలో వరద బాధితులకు పంపించనున్న నిత్యావసర వస్తువుల కిట్ల వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గౌరవాధ్యక్షురాలు విజయ భారతి ఆధ్వర్యంలో పొదుపు మహిళల సహకారంతో 20 వేల విలువైన నిత్యావసర వస్తువులను విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే సమక్షంలో ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, డీఆర్డీఏ పీడీ సలీంబాషా, మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను నవంబరు 15వతేదీ నాటికి పూర్తి చేయాలని ఎన్‌హెచ్-340సీ పీడీని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-340బికి సంబంధించి సోమయాజులపల్లె నుంచి డోన్ రూట్‌కు సంబంధించిన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. ఎన్‌హెచ్-167కి సంబంధించి ఆదోని బైపాస్ కోసం భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎన్‌హెచ్-340సి పీడీ పద్మ, ఎన్‌హెచ్-40 పీడీ అశోక్ కుమార్, ఎన్‌హెచ్-150సీ పీడీ తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

జల సంరక్షణలో ప్రజలు భాగస్వామి కావాలి: ప్రజలు జల సంరక్షణలో భాగస్వామ్యం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శుక్రవా రం గుజరాత్ రాష్ట్రం సూరత్ జిల్లా నుంచి జల్ సంచయ్ జన్ భగీధారి కార్యక్రమాన్ని ప్రధాని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పైపులైన్ల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో నీటిని అందజేస్తామన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



బాధితులకు బియ్యం ప్యాకెట్లు అందజేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులను ఆదుకుంటామని టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం విజయవాడలో వరద బాధిత కుటుంబాలక 200 ప్యాకెట్ల బియ్యం బస్తాలు, 20వేల వాటర్ బాటిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ వాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి హుశేనాపురం, సోమయాజులపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బియ్యం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు.

నిత్యావసర కిట్లు పంపిణీ

కర్నూలు(అర్బన్): నందమూరి మోక్షజ్ఞ 30వ జన్మదిన సందర్భంగా విజయవాడ వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజింగ్ సభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కే.మహేష్ గౌడ్‌లు విజయవాడకు నిత్యావసర కిట్లు పంపించారు. కార్యక్రమంలో ఆర్యశంకర్, మోతిలాల్, రమేష్‌రెడ్డి, ప్రతాప్, వెంకటేష్, నాగ నూరి, సర్దార్, సత్రం రామకృష్ణ, సాయిబాబా పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కర్నూలు(న్యూసిటీ): విజయవాడ వరద బాధితులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించినట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ తెలిపారు. శుక్రవారం బిర్లాగేట్ సమీపంలోని స్టడీ సర్కిల్స్, టీచర్స్ అకాడమీ, అశోక్‌కోచింగ్ సెంటర్, విజేత స్టడీ సర్కిల్, ఫర్‌మెన్ కళాశాల అధ్యాపకుల నుంచి రూ.27800 విరాళాలు సేకరించారు. నాయకులు రంగప్ప, రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, ఖాజావలి పాల్గొన్నారు.

● వరద సహాయక చర్యల కోసం విజయవాడ వెళ్లిన నగర పాలక రెండో బృందం విధుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం నగర పాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ వీరితో టెలికాన్ఫరెన్సు ద్వారా అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

గూడూరు: విజయవాడ వరద బాధితులకోసం సీపీఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గూడూరులో విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, కోడుమూరు, గూడూరు మండల కార్యదర్శులు రాజు, శ్రీనివాసులు మాట్లాడుతూ వరద బాధితులకు సీపీఐ తరఫున విరాళాలు సేకరించి వారికి అందిస్తామన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ మోహన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడు, రంగస్వామి, రైతు సంఘం నాయకులు మునిస్వామి, లక్ష్మన్న, శివ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 6: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సెకండరీ హెల్త్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులన్నీ ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) జీఎన్‌ఎం అర్హతతో భర్తీ చేయడానికి ఉత్తర్వులు జారీ కావడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు భగ్గుమన్నారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్ దగ్గర కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నిరసన తెలిపారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసనకు ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.మంజులదేవి మద్దతు తెలిపారు. ఏఎన్‌ఎం నుంచి జీఎన్‌ఎం అర్హతతో వచ్చిన వారితో రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టులు ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. సీనియారిటీ ప్రకారం లిస్టు పెట్టి రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం 2020లో ఏఎన్‌ఎం నుంచి జీఎన్‌ఎం శిక్షణను స్కిల్ డెవలప్మెంట్ పేరు చెప్పిందని, ఇప్పుడు ఈ ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ మాటను పక్కకు పెట్టి 2122 రెగ్యులర్ పోస్టులను శిక్షణ పొందిన వారితో ఎలా భర్తీ చేస్తారనీ ప్రశ్నించారు.

ఆర్‌యూలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 6: రాయలసీమ యూనివర్సిటీలో 125 మంది కాంట్రాక్టు నాన్ టీచింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా జీవోలను ధిక్కరించి టైం స్కేల్ ఇచ్చారని, దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని లోకాయుక్త కార్యాలయంలో ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవోనెం 194, 7/10/2016 ను కోడ్ చేస్తూ లాస్ట్ గ్రేడ్ పే స్కేల్ ఉద్యోగులకు వర్తింప చేశారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టైం స్కేల్ ఇచ్చారని అన్నారు. నాన్ టీచింగ్ పోస్టులను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయమని జీవో జారీ చేసి దాన్ని అడ్డు పెట్టుకొని నాన్ టీచింగ్ ఉద్యోగులను భర్తీ చేశారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 6: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులు సూచించారు. శుక్రవారం మండలంలోని బస్తిపాడు హౌసింగ్ లే అవుట్‌ను ఆయన సందర్శించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ ప్రభాకర్ ఉన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి: సీఐటీయూ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ డ్రైవర్లకు సుమారు 9 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీతాలు రాకపోవడంతో కార్మికులు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, రామాంజనేయులు, మహ్మద్, కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో హాజరు నమోదు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సకాలంలో అటెండెన్స్ యాప్‌ను హాజరు నమోదు చేయాలని ఏపీఆర్ఈఐఎస్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ నరసింహారావు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యా శాఖ అధికారులు, ఎంఐఎస్, డైస్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ సమావేశంలో నంద్యాల, కర్నూలు విద్యాశాఖ అధికారులు సుధాకర్ రెడ్డి, శామ్యూల్, ఏడీ శామేల్‌పాల్, మండల విద్యాశాఖ అధికారులు, ఏఎస్‌వోలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఎన్.కేశవరెడ్డి



బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేశవరెడ్డి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 6: కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి గురువారం హైదరాబాదులోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేశవరెడ్డి బీజేపీలో చేరడం ఒక మంచి నిర్ణయమన్నారు.

నగర పాలక సీపీగా ప్రదీప్‌కుమార్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 6: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారిగా ప్రదీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే పని చేసి గుంటూరుకు బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి సాధారణ బదిలీల్లో భాగంగా నగర పాలకకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏసీపీలు రంగస్వామి, శశికళ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ దామోదర్, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 6: క్రీడలతో శారీరక దృఢత్వం కల్గిస్తాయని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల అథ్లెటిక్ ఎంపిక పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా టీజీ హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర పోటీల్లో హాజరు కావాలన్నారు. కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి సుబ్బరత్నాలు, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, డీఎస్‌డీవో భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, ఒలంపిక్ సంఘం రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 6: బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కల్లూరు, సెప్టెంబరు 6: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ అన్నారు. శుక్రవారం పర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్, ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సి.బెళగల్, సెప్టెంబరు 6: మండలంలోని బ్యాడోలి గ్రామానికి మల్లేపోగు సుంకన్న భార్య నాగమ్మ(59) నాలుగు రోజుల క్రితం పాము కాటు గురైంది. ఆమె కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథను అక్కున చేర్చుకున్న ఐసీడీఎస్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 6: అనాథ యువతిని జిల్లాల బాలల సంరక్షణ సంస్థ, ఐసీడీఎస్ అక్కున చేర్చుకుంది. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో భగవాన్‌నగర్‌లో శుక్రవారం 60 ఏళ్ల ఓ మహిళ, దివ్యాం గురాలైన రాజేశ్వరి (22)ని ఎవరు లేకపోతే రెండేళ్ల వయస్సులోనే పెంచుకుంది. మహిళ మృతి చెందడంతో ఈ విషయాన్ని స్థానికులు ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మకు తెలియజేశారు. పీడీ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.శారద, భగవాన్‌నగర్‌కు చేరుకున్నారు. అనాథగా మారిన దివ్యాంగురాలిని నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు దగ్గర శక్తి సదన్‌కు చేర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: హాలహర్వి మండలం గూళ్యం గ్రామం దూదేకుల కులానికి చెందిన కాశబ్బూంసాబ్, షేకమ్మ దంపతులు రెండు నెలల క్రితం మరణించడంతో వారి ముగ్గురు పిల్లలకు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక సింద నూరు దూదేకుల సంఘం నాయకులు కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా రూ.8 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కౌతాళం మండలం ఉప్పర హాల్ బదినేహాల్ గ్రామా నికి చెందిన దూదేకుల సంఘానికి చెందిన పలువురు రూ.1.21లక్షలు చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంఘం గౌరవసలహాదారులు పి.సాయిబాబు, పి.ఇమామ్ కాశీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.షేక్షావలి, మహబూబ్ బాషా, సిద్దయ్య, మాబుసాబ్ పాల్గొన్నారు.

సోలార్ పార్కుకు భూములు ఇవ్వం

ఓర్వకల్లు, సెప్టెంబరు 6: సోలార్ పార్కు పరిశ్రమకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో చేపట్టదలిచే సోలార్ పార్కు వద్దంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు.

అవయవ దానంపై అవగాహన ర్యాలీ

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 6: అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని కర్నూలు రెండో పట్టణ సీఐ నాగరాజారావు అన్నారు. శుక్రవారం నగరంలోని 49వ వార్డు సంకల్‌బాగ్‌లో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణకుమార్ ఆధ్వర్యంలో, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఏర్పాటు చేసిన అవయవదాన అవగాహన ర్యాలీని సీఐ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు.

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి భరత్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 6: జిల్లా ప్రజలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు చేసుకుని సంతోషంతో పండుగ చేసుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కలెక్టర్ పి.రంజిత్ బాషా కూడా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు(అర్బన్): నగర ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని కోరారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 6: మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్ శర్మ అన్నారు. నగరంలోని బండిమెట్టలో ఆయన ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో చేసిన విగ్రహాలు ప్రమాదకరమన్నారు.

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా పలు సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అంద జేశారు. శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో సీక్యాంపు, కృష్ణానగర్, శరీన్‌నగర్, చెన్నమ్మ కూడలిలో జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు, పీబీవీ సుబ్బయ్యలు మట్టి వినాయకులను అందజేశారు.

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, సెప్టెంబరు 6: భక్తి శ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలని సీఐ తబ్రేజ్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ వేడుకల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

ఎంఈవోను సస్పెండ్ చేయాలి

కోడుమూరు, సెప్టెంబరు 6: కోడుమూరు ఎంఈవో వసంతలక్ష్మీబాయి సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైన్‌దొడ్డి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న టీచర్లను ఎంఈవో వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేంద్ర, అల్తాఫ్, నరసింహులు, బాలు, మిన్నెల్ల పాల్గొన్నారు.

9 నుంచి న్యాయవాదుల నమోదు ప్రక్రియ ప్రారంభం

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 6: తగ్గించిన దరఖాస్తు రుసుముతో ఈ నెల 9వ తేదీ నుంచి న్యాయవాదుల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలియజేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దరఖాస్తు రుసుమును తగ్గించి జనరల్ అభ్యర్థులు రూ.1250, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల నుంచి రూ.625లను వసూలు చేసేలా రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయించిందని తెలిపింది.

ఎట్టకేలకు నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నీటిని విడుదలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

గూడూరు సెప్టెంబరు 6: మండలంలోని పెంచికలపాడులో వృథాగా ఉన్న మినీ ట్యాంకులు ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చాయి. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పెంచికలపాడు గ్రామంలో 'వృథాగా మినీ ట్యాంకులు అన్న శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎలిజబెత్ శుక్రవారం మోటారుకు మరమ్మతులు చేయించారు. అనంతరం మినీ ట్యాంకులకు ఆమె నీటి సరఫరా చేశారు.

విద్యార్థి బస్సును నడపాలి


ఆర్టీసీ కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 6 : విద్యార్థుల పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ విద్యార్థి బస్సును నడపాలని ఎస్ఎస్‌సీపై ఏఐఎస్ఎఫ్ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు దస్తగిరి బాలకృష్ణ నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల విద్యార్థులతో కలిసి ఆర్టీసీ కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నరసప్ప, శివ, రఘుస్వామి, శ్రీరాములు, అరుణ్, కాసిం, నాగరాజు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులను నిలిపివేయడం అన్యాయం


సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 6 : ఆదోని శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అన్యాయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి నిలిచిన పనులను వెంటనే ప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను అర్ధాంతరంగా ప్రభుత్వం పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, బాలరాజు, హనుమంతప్ప, బాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

- బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బీవీ


ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 6: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎమ్మిగనూరు డిపోకు మరిన్ని బస్సు సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణంను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే ప్రజలు, ప్రయాణికులు సైతం బస్టాండ్ ప్రాంగాణం బాగుండేలా చూడాలన్నారు. డిపోలో బస్సుల కొరత ఉందని అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో 15 పల్లె వెలుగు బస్సులు తెప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్‌నాథ్, నాయకులు కొండయ్య చౌదరి, కౌన్సిలర్ రామదాసు గౌడ్, జయన్న, అల్తాఫ్, నవాజ్, అంజి, నరసింహులు, పార్టీ పరిశీలకులు శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి


కురవళ్లిలో రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత

ఆలూరు రూరల్, సెప్టెంబరు 6 : పత్తి పంట సాగులో రసం పీల్చు గులాబి రంగు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత అన్నారు. శుక్రవారం ఆలూరు మండలం కురవళ్లి గ్రామంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. ఎకరాకు 25 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు ద్వారా పురుగుల సంతతి పెరగకుండా పంటను రక్షించుకోవచ్చు అన్నారు. రైతులకు 325 లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కురవళ్లి సర్పంచ్ రవి, వ్యవసాయ అధికారులు వెంకటేశ్వర్ గౌడ్, మధుమతి, శశిధర్ రెడ్డి, వెంకటేశ్వరులు, ఆర్బీకే ఇన్‌చార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆస్పరి, సెప్టెంబరు 6 : భారీ వర్షాలకు ఖరీఫ్ పంట దెబ్బ తినడంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, రంగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, 2023 సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగాన్ని ఇన్సూరెన్స్ సబ్సిడీ వెంటనే రైతుల అకౌంట్లో జమ చేయాలన్నారు. 9,10 తేదీలలో సచివాలయం ముందు, 17,18 తేదీలలో తహసీల్దార్ కార్యలయం ముందు జరిగే ధర్నాలో మండలంలోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మధురెడ్డి, పుప్పాల దొడ్డి రామాంజినేయులు, ఇస్మాయిల్, మల్లికార్జున, మునిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు చేయాలి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 6: వర్షాలు కారణంగా పాడైపోయిన రోడ్లకు మరమ్మతు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కారణంగా రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేసి, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, జాఫర్ పటేల్, తిక్కన్న, హనుమంతు, సుభాన్, రామాంజినేయులు, గిడ్డయ్య పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాలు

పత్తికొండ, సెప్టెంబరు 6 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం పత్తికొండలో టీడీపీ విరాళాల సేకరణను చేపట్టింది. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పత్తికొండ సుస్వాగతం బోర్డు ప్రాంతం నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా పోలీస్‌స్టేషన్, పచ్చబంకు సందు, గుత్తి సర్కిల్, స్టేట్‌బ్యాంక్, బస్టాండ్, పాలపేట ప్రాంతాలలో దుకాణదారుల నుంచి విరాళాలను సేకరించారు. సేకరించిన విరాళాలను ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, రామానాయుడు, లోక్‌నాథ్, వెంకటపతి, శ్రీధర్‌రెడ్డి, బీటీ గోవిందు, దస్తగిరిరెడ్డి, కడవల సుధాకర్, శివరాముడు, ఈశ్వరప్ప, తిప్పన్న, గోపాలయ్య శ్రీనివాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తుగ్గలి: విజయవాడ వరదల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న బాధితుల సహాయార్థం జొన్నగిరిలో టీడీపీ నాయకులు తమ వంతు విరాళాలు శుక్రవారం సేకరించారు. సేకరించిన విరాళాలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, సర్పంచ్ ఓబులేసు, టీడీపీ తాలుకా రైతు సంఘం ఉపాధ్యక్షులు బాలన్న, విద్యా కమిటీ చైర్మన్ రవి యాదవ్, నాయకులు సంగాల కృష్ణ, సోము, బలరాముడు, హోటల్ మల్లి, జయరాముడు, అంజి, జయచంద్ర పాల్గొన్నారు.



వరద సహాయం కోసం పత్తికొండలో విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు: ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు సర్వస్వం కోల్పోయిన వరద బాధితులను పార్టీలకు అతీతంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. వరద బాధితుల కోసం పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన నిత్యావసర సరుకులు, తాగునీరు బాటిల్స్‌ను గురువారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడకు పంపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఆర్టీసీ డిపో కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు పంపన్న గౌడ్, భాస్కర్ యాదవ్, నాయకులు సమీఉల్లా, నరసింహారెడ్డి, ఉరుకుంద, విజయేంద్ర పాల్గొన్నారు.

● భాష్యం స్కూల్ విద్యార్థులు నిత్యావసర సరుకులు పంపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి తెచ్చిన బియ్యం బ్యాగ్లతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సేకరించి గురువారం విజయవాడకు పంపుతున్నామన్నారు.

కోసిగి: కోసిగి మేజర్ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు నరసింహులు, దుబ్బ ఈరన్న, పెద్ద ఈరన్న, తాయన్న, రాజులు విజయవాడలోని వరద ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. కోసిగి ఊరి తరపున వరద ప్రాంతాలకు వెళ్లి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.

దేవనకొండ: విజయవాడ వరద బాధితులకు టీడీపీ అధ్వర్యంలో విరాళలను సేకరించారు. రూ.2.30 లక్షల నగదు, 170 మంది వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు పంపినట్లు మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, బండిగింజల రంగన్న తెలిపారు.

పత్తికొండ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ చేపట్టిన విరాళాల సేకరణకు పత్తికొండ పందికోన గ్రామస్థులు తమవంతు సాయాన్ని అందించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో సాంబ శివారెడ్డికి తమ గ్రామం తరపున గ్రామపెద్దలు రామానాయుడు, గ్రామస్థులు రూ.లక్షన్నర విరాళాన్ని నగదుగా అందించారు.


దేవనకొండలో విరాళాలను సేకరిస్తున్న టీడీపీ నాయకులు


జొన్నగిరిలో విరాళాలను సేకరిస్తున్న టీడీపీ నాయకులు


ఎమ్మిగనూరు: వరద బాధితులకు సరుకులు, తాగునీరు పంపేందుకు సిద్ధం చేసిన సీపీఐ నాయకులు

గణేశ్ ఉత్సవాలను విజయవంతంగా చేయండి

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని/ఆదోనిరూరల్ సెప్టెంబరు 6 : గణేశ్ ఉత్సవాలన విజయవంతంగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం ఎల్ఎల్‌సీ వినాయక ఘాటు వద్ద గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, డివిజన్ స్థాయి సంబంధిత అధికారులతో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ శనివారం జరిగే వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆదోని పట్టణంలో 11న జరిగే నిమజ్జనం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గణేశ్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిమజ్జనం వెళ్లే రోడ్డులో ఏదైన గుంతలు ఉంటే వాటిని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. నిమజ్జనం దగ్గర గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జనానికి పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని డీఎస్పీకు ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీంచారు. కార్యక్రమంలో డీఎస్పీ సోమన్న, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, తహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్పీవో నూర్జహాన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీసీర దీప్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి పాల్గొన్నారు.

తీరిన విద్యార్థుల దాహార్తి


వాటర్‌ప్లాంటును పరిశీలిస్తున్న ఎంఈవో-2 శోభారాణి

కోసిగి, సెప్టెంబరు 6: కోసిగిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తాగునీటి కష్టాలు తీరాయి. శుక్రవారం తాగునీటి అవస్థలు అనే కథనం ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితం కావడంతో కథనానికి ఎంఈవో-2 శోభారాణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ స్పందించి ఆర్వో ప్లాంటును పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ


పనిముట్లను పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 6: హెచ్ మురవణి గ్రామంలో 330 మంది ఎస్సీ రైతులకు వ్యవసాయ పనిముట్లు, టార్పలిన్, టార్చ్ లైట్‌లను టీడీపీ సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రమాకాంత్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సబ్ ప్లాన్ చైర్మన్ డాక్టర్ బాలకృష్ణన్, శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్, టెక్నికల్ అధికారి లక్ష్మణ్, శేఖర్ రెడ్డి, నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఏసేబు, మల్లికార్జున, హనుమంతు రెడ్డి, విజయ్ కూమార్ పాల్గొన్నారు.


ఆదోనిలో వినాయక విగ్రహాన్ని క్రేన్ ద్వారా తీసుకెళ్తున్న నిర్వాహకులు


ఎమ్మిగనూరులో వినాయకులను కొనుగోలు చేస్తున్న మహిళలు

దీవించయ్యా.. ఉండ్రాళ్లయ్యా

● నేడు కొలువుదీరనున్న గణనాథులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 6 : వినాయక చవితిని పురస్కరించుకొని నేడు బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. పట్టణంలో వాడవాడల వినాయక మండపాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది గతం కంటే భిన్నంగా భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్టించేందుకు నిర్వాహకులు, యువత సన్నాహాలు చేస్తున్నారు. మంటపాలను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు.

ఆలూరు: ఆలూరు పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల-1లో హెచ్ఎమ్ చౌడయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గజేంద్ర అనే వ్యాపారి మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరు టౌన్ : ఎమ్మిగనూరు పట్టణంలో 34 వార్డులలో దాదాపు 300 విగ్రహాలను వివిధ కాలనీలలో ఏర్పాటు చేసేందుకు మండపాలను సిద్ధం చేశారు. ఇళ్లలో కూడా చిన్న వినాయకుడిని ప్రతిష్టిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రజలతో కిటకిటలాడింది.

కోసిగి: కోసిగిలోని 3వ వార్డులో వెలసిన ఆంజనేయస్వామి (కోసిగయ్య) గుడి దేవాలయంలో 4 అడుగుల మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు భాగంగా స్థానిక కుమ్మరి వాసులతో మట్టి గణనాథున్ని తయారు చేశా రు.

మద్దికెర: మద్దికెర గ్రామంలో ఆపద్బాందవ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు చొక్క సునీల్ కుమార్, సభ్యులు, మండల సీపీఎం కార్యదర్శి కడవల విజయకుమార్ ఉన్నారు.

పత్తికొండ టౌన్: పట్టణంలోని ప్రధాన సెంటరులో భారీ వినాయక విగ్రహాలను నెలకొల్పేందుకు నిర్వాహకులు భారీ సెట్టింగులతో మండపాలను సిద్ధం చేశారు. శనివారం రోజు నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి పండుగకు పూజా సామగ్రిని స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో, ప్రధాన రహదారి వెంట తోపుడు బండ్లపై చిన్న చిన్న విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు, పట్టణ ప్రజలు కొనుగోలు చేసేందుకు రాగా, ఆ ప్రాంతమంతా జనసంచారంతో కిక్కిరిసిపోయింది.

33 ఏళ్లుగా పర్యావరణ రహిత విగ్రహాలు ఏర్పాటు

- పూజా సామగ్రితో విగ్రహాల తయారీ


ఎమ్మిగనూరులోని కొండవీటి ప్రాంతంలో 70 కిలోల రుద్రాక్షలతో వినాయకుడు విగ్రహం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 6: ఎమ్మిగనూరు పట్టణంలోని బాలవినాయక యువక మండలి నిర్వాహకులు పర్యావరణ రహితంగా ప్రతి ఏడాది వివిధ రకాల వినాయక విగ్రహాలను ఏర్పాటు వస్తున్నారు. మరి కొంతమంది తమ సొంత నిధులతో పూజా సామగ్రితో రూ.లక్షలు వెచ్చించి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక మండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తి భావంతో పాటు సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా దాదాపు రూ.5 లక్షలు వెచ్చించి శ్రీశైలం, అరుణాచలం, భద్రాచలం ప్రాంతాలనుంచి 70 కిలోల రుద్రాక్షలను(90వేలు రుద్రాక్షలు) సేకరించి మండలికి చెందిన రఘువీర, బండాశేఖర్, అశోక్‌లు రెండు నెలలు శ్రమించి నరసింహుడు వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు. వినాయక చవితి సందర్భంగా మొదటి రోజు, చివరి రోజు పేదమహిళలకు చీరలు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేయనున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

మద్దికెర, సెప్టెంబరు 6: స్థానిక బస్టాండులోగల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల చుట్టూ కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారందరిని అధికారులు ఖాళీ చేయించారు. శుక్రవారం ఎంపీడీవో స్వర్ణలత, మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, పంచాయతీరాజ్ ఏఈ విష్ణు ఆక్రమణకు గురైన స్థలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ చంద్ర, మంగలి శేఖర్, తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం


మాట్లాడుతున్న ట్రాయ్ కార్గ్ సభ్యులు బత్తుల సంజీవరాయుడు

మంత్రాలయం, సెప్టెంబరు 6: టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కార్గ్ సభ్యులు డా. బత్తుల సంజీవరాయుడు అన్నారు. శుక్రవారం రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సును ఈడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సెల్ వినియోగదారుల ప్రయోజనాలు రక్షించడమే ట్రాయ్ ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందన్నారు. సెల్ కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, వోడాఫోన్, తదితర కంపెనీల సేవలపై ఆదేశాలు, నిబంధనలు పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులు జారీ చేస్తుందని తెలిపారు. ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు భారతదేశంలో ఉన్నారని వీరికి ట్రాయ్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో శ్రీనివాసులు, శంకర్, శివకుమార్, వడ్డె నారాయణ, సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, తిమ్మయ్య, బాబు, మురుగేంద్ర, రమణమూర్తి, అభిలాష్, బసవరాజు, వీరేష్, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎలెక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 6 : స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి అక్టోబరు 29వ తేదీ నాటికి డ్రాఫ్ట్ ఎలెక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ చేయడం జరుగుతుందన్నారు. అక్టోబరు 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించి, అక్టోబరు 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబరు 24వ తేదీలోగా అభ్యంతరాలపై వచ్చిన దరకాస్తులు పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. 2025 జనవరి 6వ తేదీ నాటికి సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివ రాముడు, ఎలక్షన్ డిప్యూటీ తాహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీవో నూర్జహాన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం


అనాథ పిల్లలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కౌతాళం, సెప్టెంబరు 6: హలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం సాబ్, షేకమ్మ దంపతులు రెండు నెలల క్రితం మృతి చెందారు. వారి పిల్లలు ఆసీయాబీ, సఫీయ, ఆఫ్రీన్ అనాథలుగా మారడంతో మండలంలోని ఉప్పరహాల్, బదినేహాల్ గ్రామాలకు చెందిన దూదేకుల కుల సంఘం పెద్దలు ఆదుకునేందుకు తమ వంతుగా రూ.1,21,000ల చెక్కును కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా అనాథ పిల్లలకు అందజేశారు. దూదేకుల సంఘం నాయకులు సాయిబాబ, మాబుసాబ్‌లు విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులను కొల్పోయిన అనాథ దూదేకుల పిల్లలకు తమ సంఘం అండగా ఉంటుందని ఇప్పటికే పిల్లలను ఆదుకునేందుకు గాను చాలా మంది స్వచ్ఛందంగా రూ.8లక్షల వరకు అందజేశారని తెలిపారు. సమావేశంలో దేదేకుల సంఘం రాష్ట్ర సలహదారులు సాయిబాబ, ఇమామ్ సాబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శేక్షావలి, జిల్లా అధ్యక్షుడు మహబూబ్, ఉపాధ్యక్షులు మాబుసాబు, మల్కన్న ఉన్నారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి

హొళగుంద, సెప్టెంబరు 6 : విద్యుత్ కోతలు విధిస్తుందండంతో గ్రామం మొత్తం అంధకారం నెలకొందని టీడీపీ, జనసేన నాయకులు అబ్దుల్ సుభాన్, అశోక్, వీరేష్, జాఫరుల్లా, బుడగజంగల్ రామాంజి శుక్రవారం అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వారం రోజులుగా రాత్రి పగలు అన్న తేడా లేకుండా గంటల తరబడి కోతలు విధిస్తున్నారన్నారు. వర్షాలు కురుస్తుండడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉందన్నారు. విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలు ఎత్తివేయాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముల్ల రఫీక్, రవి, నాగరాజు, బుడ్డా, ఖలీల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు అందజేస్తాం

మద్దికెర, సెప్టెంబరు 6: రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని దివ్యాంగులకు మంజూరు చేసిన బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. శుక్రవారం మండలానికి 18 బ్యాటరీ సైకిళ్లు మంజూరు కాగా, 27 ట్రై సైకిళ్లు రావడంతో వాటిని ఎంపీడీవో కార్యాలయానికి సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దశలవారిగా చెవిటి వారికి కూడా చెవి మిషన్లు వచ్చిన వెంటనే అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మదనంతపురం శ్రీనివాసులు, ఎంపీటీసీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.